తరుణారుణ శోభలతో విరిసిన వెన్నెల కావలసిన నీ జీవితం కొడిగట్టిన దీపం ఎలాగయిందో తల్చుకుంటే నాకు ఏడుపు ఆగటంలేదే ఏ గోడచాటుకైనా వెళ్ళి నిలబడి భోరున దుఃఖభారం దించేసుకోవాలి; అక్కా.... అక్కా....

# ధర్మ దర్శనం

నేను అట్టే చదువుకోలేదు. తెలిసీ తెలియని ఆడదాన్ని. నాకు బరువైన ఆశయాలంటూ లేవు. అది ఎందుకు ఇది ఎందుకు అంటూ క్వశ్చన్ మార్క్ కథలూ నావెల్సూ బుక్సూ అవీ రాసిపారేసి ప్రయిజులూ అవీ కొట్టేసి పేరు గడించేసి, అందరికంటె తెలివైన దాన్నని అనుకుని పెద్దా పిన్నా లేకుండా అందర్నీ తూలనాడి అందలమెక్కి కూర్చోవాలని నాకులేదు.

నావన్నీ చిన్న చిన్న కోరికలూ చిట్టిచిట్టి సరదాలూను.

నా హజ్బెండు నే గీచిన గీటు దాటితే నేనేమీ అనుకోను.

పేచీకోరు విషయాల జోలికి నేను పోను. కళ సంగీతం, నాట్యం ఇలాంటివేమీ నాకు బాగా తెలియవు.

నా ఇష్టాలు సరదాలు కొన్నైనా తీరితే నాకు అందలమెక్కి నట్లుగానే వుంటుంది. సరదాగా ఓ పుస్తకం చదువుకోవడం ఎవరేనా స్నేహితులు వస్తే కబుర్లుచెప్పుకోడం. సంతోషం కలిగించే విషయమేదైనా వుంటే మనసారా (ముఖంముటముట లాడించుకోకుండా) నవ్వటం. ఏడుపొస్తే తలగడా మంచం, పరుపూ, పక్కబట్టలూ కరిగి వరదలై పారేలా ఏడ్చేయటం భోంచేసినప్పుడు కలో గంజో - పండో - కాయో కూరోనారో- తినడం కోసవేఁపుట్టినట్లు కాకుండా - ఏదో ఒకటి తినేసి చేయి కడుక్కుని లేచి పోవాలి.

అంతేకాని తినేదానిని తినబోయేదానిని తల్చుకుంటూ జీవితం గడిపే వాళ్ళను చూస్తే నాకు పరమరోత.

వంట పొయ్యిదగ్గర పెళ్ళాం కొంగు పట్టుకు కూర్చుని కత్తి పీట కేసి చూస్తో ఆ పనీ ఈ పనీ కల్పించుకుంటూ తిరిగే అర్ధనారీశ్వరులన్నా నాకుచిరాకే.

మొగాడన్నవాడు వంటింట్లోకి బాత్‌రూంలోకి అస్తమానూ పెళ్ళాం ఏం చేస్తోందో అంటూ సి.ఐ.డి.లా అఘోరించకూడదు. స్నేహితులమధ్య - భార్యా భర్తలమధ్య, ప్రేయసీ ప్రియులమధ్య కాస్త ఎడమంటూ వుంటుంది.

ఆ ఎడం లేకపోతే నడుం విరుగుతుంది. లవ్వే వుండదు. ఆ ఎడం కడు రమ్యమైనది.

ఆ దూరాన్ని ఎవరేనా చెరిపేస్తే వాళ్ళు (ఆ ప్రేయసీ ప్రియులు) గాఢంగా జిగురెట్టి అంటించేసినట్లు అతుక్కు పోతారు.

అతుక్కు పోయిన వాళ్ళు ఎప్పుడో ఒకపుడు కుండ బద్దలు కొట్టినట్లు విడిపోవాలి. దట్సాల్ రైట్.

మొగుడన్న వాడు బొగ్గులబస్తా సాయం పట్టమంటే పట్టెయ్యాలి

నా కోసం వచ్చే లేడీస్‌ని అనవసరంగా పలకరించి, వేళాకోళాలాడి, ఇంటిదాకా దిగబెట్టొస్తానని తయారవకూడదు. బుద్ధిగా మైండ్ హిజ్ వోన్ బిజినెస్ – తిరగలి రోలూ ఈడ్చుకు రమ్మంటె తేగలిగి వుండాలి.

వంట ఏమాత్రం – పొయ్యికి క్రిందా మీదా తెలియని మొగాళ్ళతో పరమ డేంజర్.

కాఫీలు పెట్టి పకోడీలు వేయించ గలిగేపాటి కెపాసిటీ వుంటే చాలు. స్వామి కరుణించెన్ నేటికి నాజన్మ తరియించెన్ అనుకుంటుంది ఇల్లాలు. బైదిబై – పులిహోర బొబ్బట్లు – గారెలు చేస్తాననే నలభీమ పాక శాస్త్రులు మొగుడయితే ఆ కాపురం అన్నం చివిడినట్లు చివిడి తగలడుతుంది ఇదంతా సీతమ్మ ఫిలాసఫీ అని నవ్వి కొట్టిపారేస్తే కొట్టిపారెయ్యండి.

నా ఫిలాసఫీలో,

నా మొగుడూ. నా కాపరం నా పిల్లలూ వాళ్ళకి గోప్పఇంపార్టెన్స్, నా భర్త నన్ను కాస్త దయగా చూడాలి.

చీపురు కట్టను ఇత్తడి చెంబును, చెప్పుల జోడును చూసినట్లు చూడకూడదు.

నా పిల్లల కళ్ళలో వెలుగును నేను చూడకలగాలి. వాళ్ళు నన్నో వంటలక్కగానో నన్నూ మావారిని కలిసి మద్రాసు బ్రాహ్మణ భోజన కాఫీ హోటల్‌గానో చూడకూడదు. నా జీవితం నవ్వులబాట కావాలిగాని, నవ్వులాట కాగూడదు.

కిటికీ తెరిస్తే మందమలయానిలాలు వీచాలి. పక్కమీదకు వెన్నెలలు కురవాలి.

తలలోని మల్లెచెండు నా భుజంమీద వాలితే నా భుజాలు నామెడ మల్లెపూల తావితో మంచి గంధం వాసనలతో గుబాళించి పోవాలి.

కొత్తచీర కట్టుకోవడమంటే నా కాట్టే యిష్టం వుండదు.

కొత్త బట్టలలో జిలుగూ, వెలుగు తళుకూ మెరుపే కాని హాయి, సుఖం తక్కువ. చలువవేసిన జరీఅంచు తెల్లచీర మెత్తగా కన్నతల్లి ప్రేమలా వెన్నెలలా చల్లగా హాయిగా వుంటుంది.

ప్రేమలు కలకాలం ఉండవు. యవ్వనమా నీడలా పరిగెట్టేది కాని నిలబడేది కాదు. దుస్తులు, అలంకారం భోజనం ఏదీ సయించదు.

ముఖం మీదకు ముడతలు వచ్చేస్తాయి. మొహం ముదురెక్కుతుంది. నవ్వులో అమాయకత్వం పోయి గిడసబారిన గడుసుతనం స్వార్థం తొంగి చూస్తాయి. అద్దంముందు ఎంతసేపు నిలబడినా ఎన్ని పవుడర్లు, స్నోలు పులిమినా ఆ పదహారో ఏడు మళ్ళీరాదు. ముసలితనం డాబామీద ఎండలా తరుము కొస్తుంటే అప్పుడు గడిచిన యౌవ్వన మధుమాస యామినులు తల్చుకుంటూ ఏడుస్తూ కూర్చోవాలా లేక ఏ మోహర్ బాబానో, సాయిబాబానో వెంకటేశ్వరస్వామి వైపో తిరిగి పోయి భక్తిపర్వంలోనో పడిపోవాలా? నిజమే సరసశృంగార సంసార జీవితంలోనుంచి భక్తి లోకి వురకాల్సిందే –

కాని ఇల్లుకన్నా గుడి పదిలం అనేవారు పూర్వం. ఇప్పుడామాట రద్దయింది. గుళ్ళోకెళ్ళిన వాళ్ళు క్యూలో చస్తూంటే గుడి పదిలం అన్న సామెతను తెలుగులోంచి తొలగించాలి.

అయితే ఒక విషయంమాత్రం ఢంకా బజాయించి చెప్పగల్ను నాలుగుడబ్బులున్న వాడెవడూ ధర్మ దర్శనానికి ఎగబడడు. సినిమా వాళ్ళూ, వ్యాపారస్థులూ, పెద్ద పెద్ద ఆఫీసర్లూ వాళ్ళెవరూ "క్యూ"లో నిలబడరు. క్యూల్లో నిలబడేది రికమెండేషన్లు లేని అలగాజనమే కనుక తొక్కిడిలో నలిగి ప్రాణాలు పోయినవారి కందరికి దేవుడు మోక్షం ఎలాగూ యిచ్చేస్తాడు.

స్వర్గంలో పై బెర్తులకి కూడా రేట్లు పెట్టేసి అమ్మేస్తే ఎలక్షన్లలో ఓడిపోయిన వారూ, వృద్ధ సినిమాతారలు, బ్లాక్ మార్కెటర్లు ఎగబడి కొనుక్కుంటారు.

తొక్కిడిలో చచ్చిపోయిన వాళ్ళకు స్వర్గం యిచ్చినట్లే దానికి కారకులైన వాళ్ళను కూడా స్వర్గానికి పంపించే ఏర్పాట్లు చేయాలి.

కాని స్వర్గం మోక్షం ఎంత మంచివైనా ఎవరో దిక్కుమాలిన వాళ్ళకూ అభాగ్యులకూ తప్ప ఎవరికీ స్వర్గస్థలం కావాలని వుండదు. అదేమి చిత్రమో...

# కన్నె మనసులు

"కరుకులు మావాయె
కన్య మాదాయె
లబలబలు మీవాయె
రమణి మాదాయె –" అవి ఒక మగ పెళ్ళివారు ఆడ పిల్లనిచ్చుకున్న వారిని దెప్పారట!
అందులో రమణి అన్నమాట నాకెంతో ఇష్టం!

"లబలబలు మీవాయె రమణి మాదాయె" అనుకుంటూనే పూటల్లా తెలుగు పలుకుబడిలోని సొగసులు నెమరేసుకుంటూ నోరుతీపిచేసుకున్నాను.

రమణి తర్వాత రాణీ అన్న పేరేనాకెంతో ఇష్టం రాణీ అన్న పేరెట్టుకుని దాసీబుద్ధులున్న వాళ్ళంటే ఐ డోంట్ కేర్ – నాకు సంగీతం రాకపోవడానికి కారణం నేను చిన్నప్పుడు బెచ్చాలు, గోలీలు ఆడేదాన్ని మా వీధి పిల్లలందరితో చెట్లెక్కేదాన్ని, గోడలమీదపడకుండా నడిచేదాన్ని. తోటలవెంట, దొడ్లవెంటతిరగడం గొప్ప సరదా నాకు. మా ఊళ్లో దిగుడుబావి వుండేది. అందులోపడి ఉదయం కుర్రకారు ఈతలు కొట్టేవారు. అక్కడ కూర్చుని చూస్తూంటే నాకు పొద్దుపోయేది – అప్పుడప్పుడు ఆడవాళ్ళు అందులోపడటం – అలా పడ్డప్పుడు రకరకాల కథలు ఊళ్ళో ప్రచారం అయేవి. ఆబావి చుట్టూ భయంవేసే కథలు ప్రచారంలో కొచ్చేవి.